నిమిషం నిబంధన అమలు

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం

కల్వకుర్తి టౌన్: ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంటర్ పరీక్ష పర్యవేక్షణాధికారి సురేందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. పట్టణంలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో కలిపి 1,510 మంది విద్యార్థులు పాల్గొననున్నారని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. నిమిషం నిబంధన అమలులో ఉంటుందన్నారు. అనంతరం సీఎస్, డీఓ, ఇన్విజిలేటర్లతో సమావేశమై వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పరీక్షల కస్టోడియన్ వేణయ్య, ప్రభుత్వ కళాశాల లెక్చరర్లు, ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

కోడేరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ శేఖర్ తెలిపారు. పెద్దకొత్తపల్లి పద్మావతి జూనియర్ కళాశాల, రెసిడెన్షియల్ విద్యార్థులు, కోడేరు మోడల్ స్కూల్, గురుకుల, జూనియర్ కళాశాలలోని మొత్తం 400 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులు ముందుగానే కళాశాలకు చేరుకోవాలన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతి లేదన్నారు. సకాలంలో విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ హైస్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలకు మంగళవారం ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ సందర్భంగా చీఫ్‌సూపరింటెండెంట్లు మాట్లాడారు. ఈ నెల 15 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు హాజరుకావాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 308 మంది విద్యార్థులు, ఇందులో మొదటి సంవత్సరం 171 మంది, రెండో సంవత్సరం 137 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మోడల్ హైస్కూల్ మొదటి సంవత్సరం విద్యార్థులు 252, రెండో సంవత్సర విద్యార్థులు 89 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.


కల్వకుర్తిలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరీక్షల పర్యవేక్షణాధికారి సురేందర్ రెడ్డి


వెల్దండలో..

క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలో నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే వారికి భారీ జరిమానాలతో పాటుగా, కఠిన చర్యలు ఉంటాయని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిపిన వారి నుంచి ఫెనాల్టీ రుసుమును వసూలు చేశారు. ఇప్పటికే మున్సిపాలిటీలోని పలు అక్రమ నిర్మాణాలు, అనుమతులు లేని వాటికి నోటీసులు జారీ చేశామని తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ షాహెద్, కౌన్సిలర్ రవి, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

'మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచుదాం'



కొల్లాపూర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మహిళలతో మున్సిపల్ కమిషనర్ రాజయ్య స్వచ్ఛ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ఇళ్లల్లోని తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాల్లో రోజువారీగా వేయాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగస్వాములు కావాలని కోరారు. కొల్లాపూర్ మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచుదామన్నారు. మహిళా సంఘాల సభ్యురాళ్లు, మెప్మా సిబ్బంది, టౌన్ మిషన్ కోఆర్డినేటర్ ఫారుఖ్, ఎన్విరాల్‌మెంట్ ఇంజినీర్ జమీర్‌పాష పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

తెలకపల్లి: మండల కేంద్రంలో మంగళవారం బీఎస్పీ నాయకులు పోస్టర్ విడుదల చేశారు. ఈ నెల 15 నుంచి నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో బీఎస్పీ రాష్ట్రఅధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బహుజన రాజ్యాధికార యాత్ర చేస్తున్నారని, అందుకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ మండల అధ్యక్షుడు రెడ్డపాకుల శివశంకర్ మాట్లాడారు. డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ రాజ్యాధికార యాత్రతో నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఈ నెల 15 నుంచి ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. నాగర్‌కర్నూల్‌లో పార్టీ జెండాను ఎగురవేసి, అనంతరం మండలాల్లో పర్యటించి ఈ యాత్రను కొనసాగిస్తారన్నారు. సుల్తాన్, విష్ణువర్ధన్, బాలరాజు, చెన్నయ్య, నాగరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలో మంగళవారం బీఎస్పీ నాయకులు కొత్త బాలు, బంగారయ్య ఆధ్వర్యంలో బహుజన రాజ్యాధికార యాత్ర వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు లక్ష్మణ్, మహేష్, బంగారయ్య, సురేష్, రాకేష్ పాల్గొన్నారు.

సభకు తరలిరావాలి

కొల్లాపూర్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించే కాన్షీరాం జయంతి సభకు బహుజనులు తరలిరావాలని బీఎస్పీ కొల్లాపూర్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ మునిస్వామి కోరారు. సభకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరవుతారని తెలియజేశారు

'ప్రైవేటీకరణను అడ్డుకుంటాం'



నాగర్‌కర్నూల్ రూరల్: ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని, అడ్డుకుంటామని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న హెచ్చరించారు. ఈ నెల 14న కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా దళితులపై దాడులు పెరుగుతున్నాయని, ఈ దాడులను నిరసిస్తూ.. రాజ్యాంగం రిజర్వేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం కేంద్రంలోని ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో కొనసాగుతున్న బీజేపీ పాలనను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. జగన్, కృష్ణ, రాజు, బంగారయ్య, మహేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మేళాలో వైద్యసేవలపై అవగాహన

ఉప్పునుంతల: జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉప్పునుంతల పీహెచ్‌సీ పరిధిలోని 9 సబ్ సెంటర్లలో క్షయ, మహిళ ఆరోగ్య మేళ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ మేళాలో క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది ప్రజలకు వివరించారు. మహిళా ఆరోగ్యమే ఇంటింటికి సౌభాగ్యమనే నినాదంతో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా మహిళలకు అందిస్తున్న సేవలను వివరించి చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి స్వప్న, సర్పంచ్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అజోలా నాచు మొక్కపై అవగాహన

తెలకపల్లి: అజోలా నాచు మొక్కలపై పాలెం వ్యవసాయ కళాశాల రావేఫ్ విద్యార్థులు మండల పరిధిలోని కార్వంగలో మంగళవారం అవగాహన కల్పించారు. నీటిపై తేలియాడే అజోలా కలుపు మొక్క వరిపొలాలు, లోతు లేని జలపాతాల్లో ఎక్కువగా పెరుగుతుందని సూచించారు. నీలి ఆకుపచ్చ నాచుతో వరి సాగుచేయడంతో రైతులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యూరియా వినియోగం తగ్గి పెట్టుబడి ఆదా అవుతుందని, పంట భూమిలో చవుడు సమస్య చాలా వరకు పరిష్కారం అవుతుందన్నారు. పశువుల మేతకు ఈ మొక్కతో ఉపయోగాలు ఉన్నాయని, ఎండబెట్టిన అజోల్ల పొడిలో 25 నుంచి 35 శాతం మాంసకృతులు, 10 నుంచి 15 శాతం లవణాలు, 7 నుంచి 10 శాతం అమైనోఆమ్లాలు ఉంటాయన్నారు. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు ఆనంద్, సలేశ్వరం, కవితతో పాటు రావేఫ్ విద్యార్థులు జైనాబ్, వైభవి, షరణ్య, పూజ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న రావేఫ్ విద్యార్థులు

హుండీ లెక్కింపు

వెల్దండ: మండల పరిధిలోని గుండాలలో అంబారామలింగేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు వేసిన కానుకలను లెక్కించారు. హుండీ ఆదాయం రూ.2.33 లక్షలు వచ్చినట్లు దేవాలయ ఇన్‌స్పెక్టర్ వీణాదారి పేర్కొన్నారు. సర్పంచ్ మైసయ్య, ఈఓ ప్రసాద్, అర్చకులు బాలస్వామి శర్మ, కృష్ణయ్యశర్మ, సురేష్‌శర్మ, సంతోష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

రాఘాయపల్లిలో దేవతామూర్తుల ఊరేగింపు



వెల్దండ: మండల పరిధిలోని రాఘాయపల్లిలో మంగళవారం బొడ్రాయి, పోషమ్మ దేవతల విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు చేసి ఉత్సవమూర్తులను వాహనంలో ఉంచి డప్పు వాయిద్యాలతో ఊరేగింపు చేశారు. వారం రోజులు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సర్పంచ్ అచ్చాలు, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


క్రీడలు ప్రారంభిస్తున్న ఏఎస్‌ఐ అంజయ్య

తెలకపల్లి: చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఏఎస్‌ఐ అంజయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేకేరెడ్డి పాఠశాలలో క్రీడా సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిని వెలిగించి క్రీడలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. క్రీడలు ప్రతిఒక్కరికీ అవసరమన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం ఏర్పడుతుందన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలగౌడ్‌తో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ బాలు, కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి, పాఠశాల సలహాదారు రఘురాంరెడ్డి, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు ఒక రోజు శిక్షణ


లింగాలలో పూర్వప్రాథమిక విద్య శిక్షణలో

లింగాల: బోధనా పరికరాలు ఉపయోగించి, చిన్న పిల్లలకు బోధన చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్యపై అంగన్‌వాడీ టీచర్లకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. కేంద్రాల్లో చదువుకుంటున్న చిన్నారులను ఆకర్శించే విధంగా కేంద్రాలను తయారు చేయడంతో పాటు బోధన పరికరాలైన బొమ్మలు, చార్ట్‌లు, ఇతర ఆట వస్తువులను ఉపయోగించాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ టీచర్ నెలవారీ పాఠ్యాంశాలను బోధించేందుకు ముందుగానే ప్రణాళికలు(టైం టేబుల్) సిద్ధం చేసుకోవాలన్నారు. విజయలక్ష్మి, గిరిజ, బిపాషా, ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్లే స్కూల్ శిక్షణ

మన్ననూర్: అమ్రాబాద్ మండల కేంద్రంలో ఏ గ్రేడ్ యాక్టివ్‌లో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు సీడీపీఓ దమయంతి సమక్షంలో మగళవారం ప్లే స్కూల్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె పలు అంశాలను వివరించారు. టీఎల్‌ఎంను తయారు చేసి నెల వారి బోధన అంశాలను టేబుల్ విధానంలో తయారు చేశారు. ఈ క్రమంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిక్షణ కొనసాగింది. కమల, సువర్ణ పాల్గొన్నారు.

రాగి పాయసం పంపిణీ



కొల్లాపూర్: సత్యసాయి బాబా శిష్యుడు మధుసూదన్ సాయి పంపిన రాగి పాయసం పౌడర్ పాకెట్లను మంగళవారం కొల్లాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేశారు. పతంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు అర్జున్‌గౌడ్, ట్రస్టు జిల్లా ఇన్‌చార్జ్ జంగారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. విద్యార్థుల్లో పౌష్టిక శక్తిని పెంచేందుకు ఇవి దోహదపడుతాయన్నారు. బల్మూరి రాంచందర్‌రావు, నిరంజన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

తాడూరు: మండలంలోని మేడిపూర్, ఆకునెల్లికుదురు ప్రాథమిక పాఠశాలలను కాంప్లెక్స్ హెచ్‌ఎం అనిల్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయుల పనితీరు, రికార్డుల నిర్వహణ వివిధ అంశాలను పరిశీలించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులకు పాఠ్యాంశాల బోధన జిల్లా మండల కేంద్రాల్లో నిర్వహించిన వివిధ శిక్షణలో నేర్చుకున్న అంశాలపై అవగాహన కల్పించారు.

సామాజిక సేవే లయన్స్ క్లబ్ ధ్యేయం


మాట్లాడుతున్న రమేష్ బాబు

కల్వకుర్తి: సామాజిక సేవా కార్యక్రమాలే లయన్స్ క్లబ్ ధ్యేయమని మాజీ గవర్నర్, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జూలూరి రమేష్ బాబు అన్నారు. లయన్స్ క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల ఆకలి తీర్చేందుకు లయన్స్ క్లబ్ కల్వకుర్తి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, కల్మిచర్ల రమేశ్, శ్రీధర్, వెంకటేశ్, మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి రూరల్: ప్రపంచంలోని పలు దేశాల్లో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు అంతర్జాతీయ స్థాయిలో కొనసాగుతున్నాయని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రసిడెంట్ రమేశ్ బాబు అన్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని వాసవీ భవన్‌లో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలోని విభిన్న వర్గాల ప్రజలకు వాసవీక్లబ్‌ల ద్వారా సేవలు అందుతున్నాయన్నారు. క్లబ్ డైరెక్టర్ హరికృష్ణ, రామకృష్ణ, లక్ష్మీ శ్రీనివాసులు, లక్ష్మీ ఆంజనేయులు, ధనలక్ష్మి అశోక్, ప్రవీణ్‌కుమార్, గోపాల్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు తీసుకోవద్దు



పెద్దకొత్తపల్లి: పొగాకు, బీడీ, సిగరేటు, మద్యం, మత్తు పదార్థాలను సేవిస్తే క్షయవ్యాధి సోకుతుందని వైద్యాధికారి విజయ్‌కుమార్ సూచించారు. గంట్రావ్‌పల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆరోగ్య మేళలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత మత్తు పదార్థాలు సేవించరాదన్నారు. దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉన్నవారు స్థానిక ఆరోగ్య కేంద్రంలో క్షయవ్యాధి అధికారి బాలాజీని సంప్రదించి, పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనుప, రేవతి, శంకరమ్మ, సుమలత పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలు అందించాలి

వెల్దండ: గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లోని వేతనాలు అందించాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం వెల్దండలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడంతో ఇల్లు గడవడం కష్టంగా ఉందన్నారు. ఆర్థిక ఇబ్బందులతోనే సిబ్బంది ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా బీబీపేట కార్మికుడికి ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గ్రామపంచాయతీ కార్మికులు ఉన్నారు.


నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

ఇసుక ట్రాక్టర్ సీజ్

బల్మూర్: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు తహసీల్దార్ కిష్టానాయక్ తెలిపారు. గోదల్ రూట్లో టీఎస్ 31టి 9990 నంబర్ ట్రాక్టర్ ఉప్పునుంతల వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు స్థానికులు సమాచారం ఇచ్చారన్నారు. ఈ మేరకు కాపుకాసి పట్టుకున్నామని చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలియజేశారు. ఇక నుంచి ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బంద్

మన్ననూర్: గురుకులంలోని విద్యార్థిని నిఖితను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపిస్తూ.. అఖిలపక్షం ఆధ్వర్యంలో మంగళవారం మండల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఉదయాన్నే పదర, అమ్రాబాద్ మండల కేంద్రాల్లోని ప్రధాన వీధులు తిరుగుతూ.. బంద్‌కు సహకరించాలని సంఘటన గురించి వివరిస్తూ.. దుకాణాలు, హోటళ్లు, వాణిజ్య కేంద్రాలను పూర్తిగా మూసివేయించారు. కార్యక్రమంలో జేఏసీ నేత నాసరయ్య, టీడీపీ ఇంచార్జ్ మోపతయ్య, బీజేపీ కార్యదర్శి నాగరాజు, బాలకిష్టయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు చౌట కాశీం, మహేష్, విజయ్, హరి నారాయణ, ఇస్మాయిల్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

'రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి'

తాడూరు: సింగిల్‌విండో ద్వారా రైతులకు అందజేసిన వివిధ రకాల రుణాల వసూళ్లలో సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని విండో చైర్మన్ ఎండీ సమ్మద్‌పాషా కోరారు. మంగళవారం విండో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోనే తాడూరుకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఆ గుర్తింపునకు మరింత గుర్తింపు తెచ్చేలా సిబ్బంది రుణాల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి వందశాతం వసూలు చేయాలన్నారు. వసూళ్లపై దృష్టి సారించకుంటే వేతనాలు నిలిపివేస్తామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ఎక్కడ రైతులకు ఇబ్బందులు కలుగకుండా చేశామన్నారు. రైతులకు డబ్బులు కూడా వంద శాతం చెల్లించామన్నారు. సమావేశంలో సీఈఓ ఆంజనేయులు, డైరెక్టర్లు యార రమేష్, కృష్ణయ్య, గోపిరెడ్డి, మొగులమ్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విండో చైర్మన్ సమ్మద్‌పాషా

పనులు నాణ్యతగా చేపట్టాలి


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామ్మోహన్

మన్ననూర్: ఉపాధి హామీ పథకంలో భాగంగా వ్యవసాయ పొలాల్లో చేపడుతున్న పనులు నాణ్యతగా ఉండాలని ఎంపీడీఓ రామ్మోహన్ అన్నారు. అమ్రాబాద్ మండల పరిధిలోని కుమ్మరోనిపల్లిలో రైతు వెంకటమ్మ పొలంలో చేపడుతున్న వాలుకట్టల పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఫీల్డు అసిస్టెంట్, కూలీలకు పలు సూచనలు చేశారు. గ్రామంలో అర్హులైన ప్రతిఒక్కరికి కూలి కల్పించే విధంగా ప్రణాళికలను సిద్ధం చేసుకుని అందరూ పనుల్లో ఉండేలా చూడాలన్నారు. కూలీలకు ప్రతివారం చివరిలో కూలి డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని వన నర్సరీలో పెంచుతున్న హరితహారం మొక్కలను ఆయన పరిశీలించారు. ఈసీ రేణయ్య, టీఏ ఆంజనేయులు, ఫీల్డ్ అసిస్టెంట్ రవి తదితరులు పాల్గొన్నారు.

కూలీలందరికి పని కల్పించాలి

పెద్దకొత్తపల్లి: గ్రామాల్లో ఉపాధి కూలీలందరికి పని కల్పించే బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఉందని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. మంగళవారం జొన్నలబొగుడలో ఊరచెరువుకట్టపై చెట్ల తొలగింపు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఉపాధిలో పనిచేసే కూలీలందరికి పని కల్పించి వలస వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మణిరాం, భద్రాచలం పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరుచేయాలి

వెల్దండ: మండల పరిధిలోని పోతేపల్లి, పోషమ్మగడ్డ తండా, ఉబ్బలగట్టుతండాలోని శ్మశానవాటిక, డంపింగ్‌యార్డు, నర్సరీలను తదితర వాటిని మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రామంలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసి వినియోగంలో తీసుకురావాలన్నారు. ముఖ్యంగా క్రీడా ప్రాంగణాలను పూర్తి చేసి ఆటలను నిర్వహించాలన్నారు. డంపింగ్ యార్డుల్లో తడిచెత్త, పొడిచెత్తలను వేరు చేయాలన్నారు. శ్మశానవాటికలను పూర్తి చేసి వినియోగించేలా చూడాలన్నారు. వేసవి కాలంలో రైతులకు, రైతు కూలీలకు జాబ్‌కార్డులను అందించి ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. ఆయా గ్రామాల కార్యదర్శులు సురేందర్‌రెడ్డి, సునీత, ఫీల్డ్‌అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.


ఉబ్బలగట్టుతండాలో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

అంధత్వ నివారణే ప్రభుత్వ ధ్యేయం


మొకురాలలో శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ మనోహరా చెన్నకేశవులు

కల్వకుర్తి రూరల్: అంధత్వాన్ని నివారించి, ప్రజలకు కంటి చూపు మెరుగుపరిచేలా చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ మనోహరా చెన్నకేశవులు అన్నారు. మంగళవారం మండలంలోని మొకురాలలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ మనోహర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమం చేపట్టి, ప్రతిఒక్కరి కళ్లను పరిక్షిస్తారని చెప్పారు. 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతిఒక్కరూ కంటి వెలుగు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సర్పంచ్ నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ నర్సిరెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

కంటి వెలుగు పరీక్ష కేంద్రం ప్రారంభం

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని శాయిన్‌పేటలో మంగళవారం సర్పంచ్ లక్ష్మణ్‌నాయక్ కంటి వెలుగు పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించారు. వైద్యులు సంతోష్, సంధ్య, రాంచందర్ పాల్గొన్నారు.

కల్వకుర్తిలో కంటి వైద్య శిబిరం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా.. 12 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వీరందరిని హైదరాబాద్‌లోని మెడివిజన్ ఆస్పత్రికి తరలించారు. రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు విశ్వబ్రాహ్మణ సేవా సమితి నాయకులు అంజనా చారి, యాదగిరి చారి, జగన్మోహనాచారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


వినతి అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కలెక్టర్‌కు వినతి అందజేశారు. మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సురేష్, ఏఐటీయూసీ నాయకులు లక్ష్మీపతి, మణెమ్మ, బాలమణి, అలివేలమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం నాయకుల అరెస్టు

వెల్దండ: మండల కేంద్రంలో మంగళవారం బీజేవైఎం నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీలో నిర్వహించే నిరసన కార్యక్రమానికి వెళ్తున్న నాయకులను ముందస్తుగానే పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ భూములను కాపాడుకోవాలన్నారు. అరెస్టు చేసిన వారిని సాయంత్రం వదిలిపెట్టారు. మల్లేష్, కంఠం రవికుమార్, బాలకృష్ణ, అనిల్, శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

కల్వకుర్తి రూరల్: కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తానని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అర్జున్ రెడ్డి అన్నారు. మండలంలోని ముకురాలలో పార్టీ బలోపేతంపై కార్యకర్తలతో చర్చించారు. ఎవరు ఎలాంటి ఆందోళన చెందకూడదని, ఎల్లప్పుడు కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.